



సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 17-4-2025

సంపుటి: 21 సంచిక: 20
పేజీలు: 8 వెల: రూ.1


# పేకాటకు పోలీస్‌బాస్ అడ్డుకట్ట!



- ఇన్నాళ్లూ గారబందలో పేకాట శిబిరం
- శ్రీకాకుళం, నరసన్నపేట వాసుల ఆధ్వర్యంలో నిర్వహణ
- చెక్‌పోస్ట్ పెట్టి నిఘా పటిష్టంతో అక్రమ రవాణాకు చెక్
- జిల్లా ఎస్పీ తీరుతో స్థానిక పోలీసుల బెంబేలు
- సహకరించలేమని పేకాట నిర్వాహకులకు స్పష్టీకరణ



కొన్నాళ్లుగా మౌనంగా కూర్చున్న పేకాట నిర్వాహకులు ఇప్పుడిప్పుడే పేక ముక్కలు కలపడానికి చేస్తున్న ప్రయత్నాలకు ఆదిలోనే అడ్డుకట్ట పడుతోంది. ఒడిశా సరిహద్దు ప్రాంతంలో పేకాట శిబిరాల నిర్వహణపై జిల్లా పోలీసు బాస్ ప్రత్యేక దృష్టి పెట్టడంతో జిల్లాకు చెందిన వీటి నిర్వాహకుల ముందరి కాళ్లకు బంధం పడినట్లయ్యింది. పోలీసుల సహకారంతో ఇన్నాళ్లూ పేకాట శిబిరాలు నిర్వహిస్తున్న విషయాన్ని గ్రహించిన జిల్లా పోలీసు బాస్ హెచ్చరించడంతో వారంతా వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఇప్పటికీ ఒడిశాకు చెందినవారు అక్కడ పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలోని శ్రీకాకుళం, నరసన్నపేట ప్రాంతాలకు చెందిన కొందరు ఈ ఏడాది జనవరి 18 వరకు జిల్లా సరిహద్దులో ఉన్న ఒడిశా పరిధిలోని గారబంద వద్ద ప్రత్యేక పేకాట శిబిరాలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న పోలీస్ బాస్ పోలీసులను రంగంలోకి దించారు. నేరుగా పేకాట శిబిరానికి వెళ్లి అక్కడి నుంచే లైవ్ లోకేషన్ పెట్టాలని పాతపట్నం, మెళియాపుట్టి పోలీసులను ఆదేశించడంతో పేకాట శిబిరాలు మూతపడ్డాయి. అయితే అదే చోట ఒడిశాకు చెందినవారు ఇప్పటికీ శిబిరాలను కొనసాగిస్తున్నారు. గతంలో వారితో కలిసి శిబిరాలు నిర్వహించిన శ్రీకాకుళానికి చెందినవారు ఈ సమాచారాన్ని పోలీసులకు చేరవేయడం విశేషం. దానిపై స్పందించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు పాతపట్నం సర్కిల్‌కు కాకుండా కాశీబుగ్గ పోలీసు అధికారులతో రెండు నెలల క్రితం రైడ్ చేయించారు. కానీ రైడ్ జరుగుతుందన్న సమాచారం ముందుగానే లీక్ కావడంతో పేకాటరాయుళ్లు అక్కడి నుంచి పరారయ్యారు. ఆ దాడిలో జిల్లాకు చెందిన వారెవరూ చిక్కకపోవడంతో పేకాట నిర్వాహకులంటూ కొందరు ఒడిశా వ్యక్తులను పోలీసులు తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. అయితే పోలీసు జీపులను గ్రామస్తులు అడ్డుకోవడం, ఉన్నతాధికారుల ఆదేశాలతో వారిని విడిచిపెట్టక తప్పలేదు. అప్పటి వరకు గారబందలో పేకాట ఆడించినవారే పోలీసుకు సమాచారం ఇచ్చారని ఒడిశాకు చెందిన వీరి పార్టనర్స్ అనుమానిస్తున్నారు.

## చెక్‌పోస్టులతో అడ్డుకట్ట

అంతకు ముందు వీరంతా కలిసి ఒడిశాలోని సుంకి, బల్లుగాం, పూరీల్లో పేకాట శిబిరాలు నిర్వహిస్తూ వచ్చారు. తర్వాత అక్కడ నుంచి గారబందకు శిబిరాన్ని తరలించి నెలలో 30 రోజులూ పేకాట ఆడిస్తూ వచ్చారు. ఈ శిబిరానికి విజయగనరం, విశాఖ, రాజాం, నరసన్నపేట, పలాస, పర్లాకిమిడి, బరంపురం ప్రాంతాల నుంచి జూదరులు వస్తుండేవారు. జిల్లా పోలీసులు ఈ ఏడాది సంక్రాంతి మరుసటి రోజు గారబంద పేకాట శిబిరం వద్దకు వెళ్లడంతో అప్పటి నుంచి శ్రీకాకుళం, నరసన్నపేట నుంచి నిర్వాహకులు అక్కడికి వెళ్లడం మానేశారు. గారబంద కాకుండా ఒడిశాలోని వేరే ప్రాంతానికి వెళ్లడానికి ప్రయత్నాలు చేసినా, ఆ సరిహద్దులో ఉన్న పోలీసు అధికారులు నిరాకరించారు. దీంతో ఇప్పటి వరకూ ఖాళీగా కూర్చున్నారు. తాజాగా కొందరు పోలీసు అధికారులతో శ్రీకాకుళం పేకాట బ్యాచ్ మంతనాలు ప్రారంభించింది. అవకాశమిస్తే పేకాట శిబిరాన్ని నిర్వహించుకుంటామని సన్నిహితులైన పోలీసులతో బేరాలు పెట్టడం ప్రారంభించారు. దీనికి ఇప్పటి వరకు ఎవరూ సమ్మతించలేదు. ఇదే సమయంలో పోలీసు బాస్ ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి మద్యం, మత్తుపదార్థాల అక్రమ రవాణాను నిరోధించడానికి గొప్పిలి గ్రామం వద్ద రెండు రోజుల క్రితం ప్రత్యేక చెక్‌పోస్టు ప్రారంభించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పాతపట్నం, మెళియాపుట్టి మీదుగా పేకాటరాయుళ్లు గారబందకు వెళుతుండేవారు. ఈ రెండుచోట్ల - మిగతా చివరి పేజీలో









• ఎడిటోరియల్

# ఈ చట్టం వక్ఫ్ రక్షణకా.. భక్షణకా?

ప్రస్తుతం దేశంలో మత ఉద్రిక్తతలకు, తీవ్ర చర్చకు కారణమవుతున్న అంశం కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేసిన వక్ఫ్ సవరణ చట్టం–2025. పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోదంతో ఇటీవలే అమల్లోకి వచ్చిన ఈ చట్టంపై పశ్చిమ బెంగాల్, మరికొన్ని రాష్ట్రాల్లో నిరసనలు, ఘర్షణలు చెలరేగుతుంటే.. మరోవైపు ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఏకంగా 72 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరిపి, తీర్పు ఇవ్వడానికి సద్ధమైంది. అసలు వక్ఫ్ అంటే ఏమిటి? ప్రస్తుత వివాదాలకు కారణమేమిటి?? ఒకసారి పరిశీలిద్దాం. ముస్లింలు తమ మతానికో, మసీదుకో ఆస్తిని దానంగా ఇవ్వటాన్ని ఉర్దూలో వక్ఫ్ అంటారు. ఇలా సంక్రమించిన ఆస్తిని వేరొకరికి అమ్మటానికి గానీ, బహుమతిగా ఇవ్వటానికి గానీ వీల్లేదు. వీటి మీద వచ్చే ఆదాయంతో మసీదులు, స్కూళ్లు, ఆస్పత్రులు వంటివి కట్టుకోవచ్చు, ఆ మతానికి చెందిన పేద విద్యార్థులను చదివించటం వంటి పనులకు కూడా వాడుకోవచ్చు. మన దేశంలో ఢిల్లీ సుల్తానుల కాలం (1206 సంవత్సరం) నుంచీ వక్ఫ్ ఉంది. అప్పటి నుంచి దాతలు దానంగా ఇవ్వటం వల్ల దేశంలో ఆ మత సంస్థలకు చాలా ఆస్తులు సమకూరాయి. వాటి పర్యవేక్షణకు మొదటిసారిగా 1913లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎక్కడికక్కడ వక్ఫ్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ముస్లిం పెద్దలు వీటిలో సభ్యులుగా ఉంటూ వక్ఫ్ ఆస్తులను, వాటి ఆదాయాన్ని పరిరక్షిస్తూ.. ఆదాయాన్ని ఖర్చు చేసే విషయంలో తగిన సలహాలు ఇవ్వాలని నిర్దేశిస్తూ ఒక చట్టం చేసింది. అప్పటి నుంచి స్వాతంత్ర్యానంతరం కూడా దశాబ్దాలుగా అమలైన ఈ చట్టంలో పలు మార్పులు చేస్తూ పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో చేసిన చట్టమే ద వక్ఫ్ యాక్ట్–1995. ఈ చట్టం ప్రకారం దేశం మొత్తానికి సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేశారు. అలాగే ప్రతి రాష్ట్రానికి ఒక వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేశారు. ఆయా రాష్ట్రాల్లోని వక్ఫ్ ఆస్తులను ఆ బోర్డులో రిజిస్టర్ చేయించాలని తద్వారా ఒక సెంట్రల్ రికార్డు నిర్వహించేలా ఆ చట్టంలో నిర్దేశించారు. వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలు, ఇతర అవసరాలకు దుర్వినియోగం కాకుండా చూడటంతో పాటు వివాదాలను పరిష్కరించే అధికారాలను వక్ఫ్ బోర్డులకు కట్టబెట్టారు. అయితే కాలక్రమంలో ప్రభుత్వాలు ఈ బోర్డులను రాజకీయ పునరావాసానికి వాడుకోవటం ప్రారంభించాయి. ఫలితంగా అవినీతి పెరిగింది. వక్ఫ్ ఆస్తులను కాపాడటం పోయి సొంతానికి వాడుకోవటం మొదలైంది. చివరికి ప్రభుత్వాలే వక్ఫ్ భూములను ఆక్రమించసాగాయి. ఆ ప్రభుత్వాలే నియమించిన వక్ఫ్ బోర్డులు దానికి ఎదురు చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆస్తులు ఉన్నప్పటికీ వాటిపై ఆదాయం సరిగ్గా రావటం లేదని, ముస్లింల అభివృద్ధికి ఉపయోగపడటం లేదని, అందువల్ల వక్ఫ్ బోర్డుల్లో కొన్ని సంస్కరణలు చేయాల్సిన అవసరం ఉందని 2006లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం నియమించిన సచార్ కమిటీ సూచించింది. దీనికి దేశవ్యాప్తంగా ఉన్న ఆ మత పెద్దలు కూడా ఒప్పుకున్నారు. దాన్ని ఆధారం చేసుకునే ఇప్పుడు మోదీ సర్కారు కొత్త వక్ఫ్ చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే ఈ చట్టంలో అనేక లోపాలు ఉన్నాయంటూ ముస్లిం సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. కొత్త చట్టం ప్రకారం వక్ఫ్ బోర్డులో ముస్లిం మతస్తులు కాని వారిని కూడా తప్పనిసరిగా నియమించాలి. ఒక మతానికి చెందిన బోర్డులో ఇతర మతస్తులు ఉండాల్సిందేనని చట్టం చేయడం సరైనదేనా? అలా చేయాలనుకుంటే అన్ని మతాల బోర్డుల్లోనూ ఇతర మతస్తులకు చోటు కల్పించేలా చట్టం చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఇక రెండో మార్పు ఏమిటంటే.. ప్రస్తుతం వక్ఫ్ కింద ఉన్న ఆస్తులకు సరైన పత్రాలు సమర్పించి అవి వక్ఫ్ అని నిరూపించాలి లేకపోతే వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. ఒక తరం కిందట మనకు సంక్రమించిన ఆస్తులకే సరైన పత్రాలు ఉండవు. అంతెందుకు మనం కొన్న భూమి మనకే చెందుతుందా అనే పరిస్థితులు ఉన్న దేశంలో ఎప్పుడో వందల ఏళ్ల క్రితం దానం ఇచ్చిన భూములు తమవేనని నిరూపించుకోకపోతే ప్రభుత్వం తీసుకుంటుందనడం న్యాయమా? ఇలాగా దేశంలో ప్రతి మత సంస్థ పరిధిలో ఉన్న భూములకు ఇదే చట్టం చేసి ప్రభుత్వం ఆ భూములను తీసుకుంటామంటే ఆయా మతాలవారు అంగీకరిస్తారా? బ్రిటీష్ వారు కూడా చేయని పలు క్రూరమైన అంశాలు వక్ఫ్ చట్టంలో ఉన్నాయి. వీటిని తక్షణం రద్దు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

## పారిశుద్ధ్యం పట్ల అవగాహన ఉండాలి

(సత్యంన్యూస్, గార)

సమాజంలో పారిశుద్ధ్యం పట్ల అందరికీ అవగాహన ఉండాలని, వ్యర్థాలను సురక్షితంగా విసర్జించడం అలవాటు చేసుకోవాలని వాడాడ గ్రామ సర్పంచ్ ఎస్.సురేష్ గురువారం పేర్కొన్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ మల విసర్జనను సురక్షితంగా చేయటం, నీటిని శుభ్రపరచడం, వ్యర్థాలను నిర్వహించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చుని, పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు చేస్తుందన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం పట్ల అవగాహన కల్పిస్తూ, చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను పర్యావరణానికి హాని కలిగించకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామవీధుల్లో శానిటేషన్ చేయించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ముద్దాడ బాలలకు బహుమతుల పంట



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాజమహేంద్రవరం నగరానికి చెందిన స్వర్గీయ జేజేపీ నెహ్రూ జ్ఞాపకార్థం మత్తి పవన్ ఆర్థిక సహాయంతో ముద్దాడ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న బాలబాలికలకు బహుమతులను అందించారు. పిల్లలపై ఉన్న అత్యంత ప్రేమతో ముద్దాడ పిల్లల ప్రతిభను గుర్తించి ఈ బహుమతులు అందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మణిపాత్రుని నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కర్రి నేలవేణి, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, పద్మజ, గణపతి రావు, శ్రీనివాసరావు, అమరావతి పాల్గొన్నారు. పిల్లలకు బహుమతులు అందించడం పట్ల దాతలను పలువురు అభినందించారు.

## గుత్తు చిన్నారావుకు కందుకూరు కళారత్న పురస్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీసుమిత్ర కళాసమితి ప్రధాన కార్యదర్శి గుత్తు చిన్నారావుకు కందుకూరు కళారత్నం పురస్కారం లభించింది. శ్రీకాకుళంకు చెందిన శ్రీసుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో ప్రదర్శించిన కన్యాశుల్కం నాటిక పోటీలకు ఎంపిక కావడంతో గుత్తుచిన్నారావుకు ఈ పురస్కారం లభించింది. ఈమేరకు మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. గుత్తు చిన్నారావు బాదుర్లపేట గ్రామంలో శ్రీ త్రినాధ కళానికేతన్ ఆధ్వర్యంలో 14 ఏళ్ల వయసులో మంచి – చెడు నాటికతో నటుడుగా ప్రారంభించారు. అప్పటి నుంచి అనేక సాంఘిక నాటకాలు దర్శకత్వం వహించి నటించారు. ఈనేపథ్యంలో కన్యాశుల్కం నాటకం కూడా ఇప్పిలి శంకర్‌శర్మ దర్శకత్వంలో ప్రదర్శించారు. దీనికి జిల్లా స్థాయిలో కందుకూరు పురస్కారం లభించింది.



## పల్లె నిద్రకు అనూహ్య స్పందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ చేపట్టిన పల్లెనిద్ర కార్యక్రమానికి స్పందన లభిస్తోంది. బుధవారం నగరంలోని సీపన్నాయుడుపేట కమ్యూనిటీ హాల్లో రాత్రి పల్లె నిద్ర చేసిన ఎమ్మెల్యే శంకర్ గురువారం ఉదయం అక్కడే కాలకృత్యాలు తీర్చుకున్నారు. స్థానిక నాయకులతో కలిసి అల్పాహారాన్ని స్వీకరించారు. అనంతరం స్థానికంగా ఉండే సమస్యలపై చర్చించి గ్రామంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు పూర్తయినప్పటికీ ప్రతి గ్రామంలో సమస్యలు తెలుసుకుని వారిని పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. అదేవిధంగా సీపన్నాయుడుపేట హైవే ప్రక్కన గల మురుగునీటి సమస్యను గుర్తించి అధికారులకు తక్షణమే పరిష్కరించమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బంది స్థానిక నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం అప్కాస్ స్థానంలో ప్రైవేట్ ఏజన్సీలు తెచ్చిపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించాలని, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చెయ్యాలని సిఐటియు ఉపాధ్యక్షులు కె.సూరయ్య, సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులు, ఎన్ఎంఆర్, బదిలీ, కోవిడ్ కార్మికులతోపాటు క్లాప్ డ్రైవర్లకు 36 జిఓ ప్రకారం జీతాలు పెంచాలన్నారు. గత 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, దహన సంస్కారాలు, సంక్షేమ పథకాల అమలుకు వెంటనే జీఓలు జారీ చెయ్యాలని కోరారు. పదవీ విరమణ 62 ఏళ్ళకు పెంచాలని, గ్రాట్యూటీ చెల్లించాలని పెద్ద ఎత్తున నినదించారు. 60 ఏళ్ళకు బలవంతంగా తొలగించిన, అనారోగ్యం పాలైన, చనిపోయిన వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఇంజనీరింగ్, ఎన్ఎంఆర్, క్లాప్‌డ్రైవర్లకు జీఓ నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలని హితవు పలికారు. అక్రమ తొలగింపులు, వేదింపులు ఆపాలని కోరారు. పనిముట్లు, సెలవులు, పర్మినెంట్ కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ శలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నగర విస్తీర్ణ పరిధికనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేని పక్షంలో భవిష్యత్ పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో కె.రాజు, ఎ.శంకర్, ఎ.మోహన్, ఆర్.యుగంధర్, డి.యుగంధర్, ఎ.రాజశేఖర్, డి.చిట్టి, దేవసంతోష్, ఎన్.పార్వతి, జె.మాధవి, ఆర్.ఈశ్వరమ్మ, ఎం.మల్లెమ్మ, ఇంజనీరింగ్ నాయకులు గిరిజాశంకర్, త్రినాధరావు, తదితరులు పాల్గొన్నారు.



“విజయం తర్వాతి అడుగు చాలాసార్లు గెలుపుకన్నా కష్టమైనది” ఇండస్ట్రీలో ఇప్పుడు యష్ పరిస్థితి చూస్తే ఈ మాట గుర్తొస్తుంది. ఒక సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ అయితే ఆ తర్వాత ఆ హీరో చేసిన సినిమాలపై ఖచ్చితంగా ఆ ఇంపాక్ట్ పడు తుంది. దాంతో అంచనాలు పెరిగిపోయి, వాటిని అందుకో లేక అవి చతికిల పడుతూంటాయి. ఇప్పుడు యష్ కొత్త సినిమా టాక్సిక్ ఇదే సమస్య ఎదురవుతోంది. ఈ సినిమా కు బజ్ క్రియేట్ కావడం లేదు. కేజీఎఫ్ తో పోల్చి చూసి, ఆ స్థాయిలో ఉంటుందా ఉండదా అని ప్రతీదాన్ని బూతద్దంలో అభిమానులు చూస్తున్నారు. రేపు రిలీజ్ అయ్యాక కూడా అదే పరిస్థితి వస్తుందని యష్ భయపడుతున్నారు.

కేజీఎఫ్.. ఓ సినిమా కాదు, ఓ సంచలనం. కేవలం బాక్సాఫీస్ వసూళ్లే కాదు, యష్ అనే హీరోను దేశవ్యాప్తంగా ఓ మాస్ ఐకాన్‌గా మార్చిన చిత్రం. కానీ అదే విజయం ఇప్పుడు అతనికి ఓ బరువైన తలపాగా అయింది.

# కేజీఎఫ్ మూవీ సక్సెస్..

Yash is now not just a star, but a business model..

- జోశ్యుల సూర్యప్రకాశ్

# యష్‌కు తలనొప్పిగా మారిందా?



కేజీఎఫ్ తర్వాత... యష్ కెరీర్ ‘టాక్సిక్’ మోడ్‌లోకి వెళ్ళిపోతోందా అని అభిమానులు కంగారు పడుతున్నారు. యష్‌కు కేజీఎఫ్ సక్సెస్ అనేది బ్లెస్సింగ్‌గా మారుతుందా లేక బర్డెన్‌గా మారుతుందా అనే చర్చ ఇప్పుడు ట్రేడ్ లో జరుగుతోంది. వాస్తవానికి కేజీఎఫ్ యష్‌కు ఓ స్టార్‌డం ఇవ్వలేదు. అది ఒక బ్రాండ్‌ని పర్సనాలిటీని ఇచ్చింది.

కేజీఎఫ్ అంతలా హిట్ అవుతుందని ఎవ్వరం ఊహించలేదు. కానీ ఇప్పుడు ప్రతి ఒక్కరూ ‘అలా’ హిట్ కావాలనుకుంటున్నారు!. కేజీఎఫ్–2 హిందీ బెల్ట్ ఎలోన్‌లో రూ.400 కోట్లు గ్రాస్ చేసింది. ఇది సౌత్ హీరోకి అరుదైన ఘనత. ఓటీటీ, స్ట్రీమింగ్, మ్యూజిక్ రైట్స్ కలిపి రూ.200 కోట్లకు పైగా డీల్. బ్రాండ్ వాల్యూ కూడా డబుల్ అయింది. యష్ ఇప్పుడు రూ.10కోట్ల పైగా ఛార్జ్ చేస్తున్నట్లు సమాచారం. ఈ స్థాయిలో ప్రెస్టీజియస్‌గా మారిన తరువాత, ‘టాక్సిక్’ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు తలెత్తడం సహజం. కానీ వాటిని తట్టుకోవడమే అసలైన సవాలు.

ఇప్పుడు ‘యష్’ అంటే: మాస్&మాడ్ లుక్, యాక్షన్ & ఎమోషన్ కలయిక, స్టైల్ & సబ్‌స్టెన్స్ మిక్స్, ఎలివేటెడ్ డైలాగ్స్, హెవీ బీజీమ్ ఈ డిఫినిషన్‌కు ఏమాత్రం తగ్గినా, అభిమానుల్లో “ఇది యష్ సినిమా ఎలా?” అన్న అనుమానాలు మొదలవుతాయి. అది ఇప్పుడు టాక్సిక్ ఎదుర్కొంటున్న అసలు ఇబ్బంది ఇదే. ఓ సౌత్‌ట్రేడ్ ట్రాకర్ ఎనాలిసిస్ట్ చెప్తున్నట్లు .. టాక్సిక్ అనేది ఓ సినిమా కాదు. అదో ప్రెజర్ వాల్వ్. అది వర్కవుట్ కాకపోతే, బ్రాండ్ దెబ్బతింటుంది, ఆ దెబ్బ యష్ కు మాత్రమే కాదు, ప్యాన్ ఇండియా స్టార్డమ్ కు కూడా తగులుతుంది.

కేజీఎఫ్ మాస్ ఇమేజ్‌తో స్టార్ అయిపోయిన యష్, ఇప్పుడు అదే ఇమేజ్‌ను మెయింటైన్ చేయాలంటే ఆయన చేసే సినిమా ఓ స్టేట్‌మెంట్ కావాలి. టాక్సిక్ ఆ పని చేయగలుగుతుందా? అలాగే బిజినెస్ టెర్మ్స్‌లో కేజీఎఫ్ బ్రాండ్‌కి భరోసా ఉందని, డిస్ట్రిబ్యూటర్లు, ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ ముందుకు వచ్చారు. కానీ టాక్సిక్ విషయంలో ఓటీటీ ప్రీ రిలీజ్ రేట్లు తక్కువగా ఫిక్స్ అవుతున్నట్లు సమాచారం. హిందీ బెల్ట్ డీల్‌లు నెమ్మదిగా క్లోజ్ అవుతున్నాయి. థియేట్రికల్ అడ్వాన్స్‌లు ఫైనల్ కావాల్సిన స్టేజ్‌లో ఇంకా చర్చలు జరుగుతున్నాయి. ఇవన్నీ సమస్యలే.

అలాగే ఈ సినిమా ద్వారా యష్ బ్రాండెడ్ ఫార్ములా కంటే కంటెంట్‌ను ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇది సినిమాటిక్‌గా చేస్తున్న ఓ సాహసం. వాస్తవానికి “టాక్సిక్ ఫెయిల్ అయితే... కేవలం ఓ సినిమా ఫెయిలవదు. అది యష్ ట్రైడ్ అండ్ టెస్టెడ్ మాస్ మాస్క్ మీదే ప్రశ్నలు రేపుతుంది. యష్ కు మార్కెట్ స్లో అవుతుంది. తక్కువ బడ్జెట్‌లో గేమ్ ప్లాన్ చేయాల్సిన పరిస్థితి వస్తుంది. బ్రాండ్ వాల్యూ మళ్ళీ కొత్తగా రీకన్ స్ట్రక్ట్ చేయాల్సిన పరిస్థితి వస్తుంది.

అదే టాక్సిక్ హిట్ అయితే: యష్‌కు ఫ్రీడమ్ వస్తుంది. విభిన్న జానర్లలో ప్రయోగాలు చేయడానికి. కొత్త డైరెక్టర్లకు డోర్ ఓపెన్ అవుతుంది. పాన్ ఇండియా స్కేల్ మీద. ట్రేడ్‌లో కేజీఎఫ్ తర్వాత కూడా అదే స్థాయిని కొనసాగిస్తూ సక్సెస్‌ని డెలివరీ చేయగలడు’ అనే నమ్మకం వస్తుంది టాక్సిక్ అనే సినిమా కాదు,

### యష్ కెరీర్‌కి లిట్మస్ టెస్ట్!

కేజీఎఫ్ విన్నింగ్ స్ట్రీక్‌ని నిలబెట్టుకోవాలంటే, ‘టాక్సిక్’ సాధారణ హిట్ కాకూడదు. అది సిగ్నేచర్ స్టేట్‌మెంట్ అవ్వాలి. అవతల అభిమానుల అంచనాలు, ఇటు బిజినెస్ ప్రెషర్స్.. మధ్యలో యష్ తాను ఏం నిరూపించబోతున్నాడన్నది చూడాల్సిన అంశం.

When a star becomes a symbol, every move becomes a message.. అనేది నిజం

ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, యష్ ఈ సినిమా మీద చాలా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారట. కేజీఎఫ్ తర్వాత వచ్చిన బజ్‌ను నిలబెట్టుకోవాలంటే

కేవలం మాస్‌గా ఉండటం సరిపోదు. ఇంటెలిజెంట్ స్టోరీటెల్లింగ్, స్కేల్ అవసరమని ఆయనకు బాగా అర్థమైందని టాక్. అందుకే టాక్సిక్ స్క్రిప్ట్ మీద చాలా పర్సనల్‌గా ఇన్వాల్వయ్యారట. రాకింగ్‌స్టార్, కేజీఎఫ్ ఫేమ్ యష్ హీరోగా తెరకెక్కుతున్న టాక్సిక్ చిత్రం హిందీ, తెలుగు, తమిళం, మలయాళం తో సహా పలు భారతీయ, అంతర్జాతీయ భాషల్లోకి డబ్ కానుంది. ఈ ప్రాజెక్టుకి అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. జాన్‌విక్, ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్ ఫ్రాంచైజీలకు పని చేసిన జేజే పెర్రీ యాక్షన్ సీక్వెన్స్‌లకు గ్లోబల్ ఆడియెన్స్ ఫిదా అవుతరాని మేకర్స్ చెబుతున్నారు. అంతే కాకుండా రీసెంట్‌గా డ్యూన్ పార్ట్–2 విజువల్ ఎఫెక్ట్స్‌కి గానూ బాఫ్టా ఫిల్మ్ అవార్డుని అందుకున్న డినెగ్ ఈ మూవీకి విజువల్ ఎఫెక్ట్స్‌ను అందిస్తున్నారు.

# బీటీ రోడ్డు శంకుస్థాపన



(సత్యంన్యూస్, పాతపట్నం)

నియోజకవర్గ పరిధి గల పాతపట్నం మండలంలోగల పాతపట్నం తెంబూరు రోడ్డు నుండి వయా సింగుపురం రట్టిపేట గ్రామం వరకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులకు సంబంధించి రూ.1.60కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజక వర్గం పరిధిలో గల అనేక గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టే విధంగా తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



నూతనంగా బాధ్యతలు చేపట్టిన లావేరు తహశీల్దార్ రాజేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గోపాల్ తదితరులున్నారు. – సత్యంన్యూస్, లావేరు

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

# ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని డే అండ్ నైట్ జంక్షన్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, టౌన్ హాల్ రోడ్డులో ఉన్న చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి అధికంగా ఉండడంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప పగటి వేళల్లో బయటకు రావద్దని సూచించారు. బయటకు వచ్చే వారు తలపై టోపీని తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రతీరోజూ అధికంగా మజ్జిగ, మంచినీరును తీసుకోవాలని తెలిపారు. చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.



# పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి

(సత్యంన్యూస్, పాతపట్నం)

రానున్న వేసవికాలంలో ఎండలు మండిపోతున్నందున పశువులను ప్రతి ఒక్కరూ కంటికి రెప్పలా కాపాడుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. ఈమేరకు మండలంలోని సింగుపురంలో ఏర్పాటు చేసిన పశువుల తాగునీటి తొట్ల నిర్మాణాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మండుతున్న వేసవి ఎండలకు మనుషులకు నీరు దొరకడం కష్టంగా ఉందన్నారు. నీటి ఎద్దడి పశువుల విషయంలో మరింత ఎక్కువగా ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఈ తొట్ల నిర్మాణాన్ని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం వేసవిలో చెరువులు,కుంటల్లో నీరు అడుగంటడంతో నీటి సమస్య తలెత్తనుందన్నారు. గతంలో నిర్మించిన పశువుల తొట్లు అనేక గ్రామాల్లో వృథాగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు పశువుల తొట్లను ఉపయోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు.



# స్టేట్ టాపర్‌ను అభినందించిన నారా లోకేష్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ మార్కులు సాధించిన అండ్లూరి సేవేంద్ర కుమార్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. విజయవాడలో జరిగిన షైనింగ్ స్టార్స్ 2025 కార్యక్రమంలో సేవేంద్రకుమార్‌ను, తల్లిదండ్రులతో సహ అభినందించి ల్యాప్‌టాప్ బహూకరించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్ (సీజీఏ) వృత్తి విద్యా కోర్సులో గ్రూపులో 1000 మార్కులకు గాను 958 మార్కులు సాధించాడు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని సీజీఏ గ్రూప్ విద్యార్థులలో రాష్ట్రస్థాయి టాపర్‌గా సేవేంద్ర నిలిచాడు. అతని తల్లిదండ్రులు అప్పలరాజు, భవాని ఒప్పంగి గ్రామంలో కుమ్మరి వృత్తి చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథముడుగా నిలిచిన సేవేంద్రను డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు, అధ్యాపకులు కాశీరెడ్డి రవిశంకర్, బి.సుష్మశ్రీ, జీ.ఎఫ్.సీ శ్రీరామ్మూర్తి, టి.తులసీ ఇంఛార్జి ప్రిన్సిపాల్ గణపతి వెంకటేశ్వర రావు, సీనియర్ అధ్యాపకులు శివరాం ప్రసాద్, ఫల్గుణరావు, జయరాం, జగదీష్, పెనుగుదురు ప్రసాదరావులు అభినందించారు.



ఎచ్చెర్ల మండలం చిన్నరావుపల్లి గ్రామంలో ఐసిడిఎస్ పిఓ డోల పాపినాయుడు ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవ 1000 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారాన్ని ప్రతీ రోజూ తీసుకోవాలని సూచించారు. తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త రాజ్యలక్ష్మి, బాలింతలు, గర్భిణీలు, తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, ఎచ్చెర్ల

# టీడీపీ నాయకుల భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి




పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో తెలుగుదేశం పార్టీ నాయ కులు చేపట్టిన భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని వైకాపా నాయ కులు కోరారు. ఈమేరకు గురువారం తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పలాసలో తెలుగుదేశం పార్టీ నాయకులు చేపడుతున్న భూ ఆక్రమణలకు అంతే లేకుండా పోతుందన్నారు. వీటిని కప్పిపుచ్చుకునేందుకు తమపై ఆరోపణలు చేస్తూ తహశీల్దార్‌కు ఇటీవల వినతిపత్రం ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. పలాస పరిధి పురుషోత్తపురం రెవిన్యూ గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 51 సుమారు నాలుగు ఎకరాలు భూమిని పట్టణ టీడీపీ నాయకులు టిడిపి నాయకులు పద్మనాభపురం సర్వేనెంబర్ 395/1, 362/2బి, 362/7ఎ నంబర్లలో తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి ఉన్నారన్నారు. అలాగే కాశీబుగ్గ సర్వే నెంబర్ 234/1 తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి పురుషోత్తపురం సర్వేనెంబర్ 51 ప్రభుత్వ భూమిని ఫ్లాట్లుగా మార్చి అమ్మేసి ఉన్నారని విమర్శించారు. పలాస పరిధి అనంతపురం గ్రామ పరిధి సర్వే నంబర్ 253లో ఉన్న సుమారు 40సెంట్లు శనీశ్వరుడు కొండ భాగాన్ని కిడ్నీ ఆసుపత్రి దగ్గర సత్యసాయి భవనంకు ఎదురుగా కొండ భాగాన్ని కంకర తవ్వి చదును చేసి టీడీపీ నాయకుడు తన బంధువులు,మిత్రులు పేరున పక్కన నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేసి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకున్నారన్నారు. సదరు భూమి పైన సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పద్మనాభపురం రెవిన్యూ సర్వేనెంబర్ 362/5 సూదికొండ నుండి పద్మనాభపురం సమీపంలో ఏఎంసి గోడౌన్ వెనుక భాగం నుండి పద్మనాభపురం తాళ్ళ చెరువుకు వెళ్లే వరద కాలువ సుమారు 2 ఎకరాల 31 సెంట్లు ప్రభుత్వ భూమిని కొంతమంది టిడిపి నాయకులు ఆక్రమణ చేసి ఫ్లాట్లుగా మార్చి చాలామందికి అమ్మివేసి కోట్లాది రూపాయలు దోచుకున్నారన్నారు. నాటి టెక్కలి సబ్ కలెక్టర్ వికాస్ మర్మత్ స్వాధీనం చేసుకుని అది ప్రభుత్వ భూమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గోపి, వైకాపా నాయకులు బత్తిన హేమేశ్వరరావు, అంబటి ఆనంద్, బమ్మిడి సంతోష్, తూముల శ్రీనివాసరావు, బమ్మిడి దుర్యోధనరావు, దువ్వాడ రవి, కంచరాన భాస్కరరావు, తూముల శ్రీనివాస్, గొండు మోహన్, గుజ్జు జోగారావు, వాయలపల్లి లక్ష్మణ్, బోనెల రవి, నర్తు వెంకటరమణ, నెయ్యల శివలు పాల్గొన్నారు.



మండల కేంద్రంలో రైతు ఉత్పదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) కలెక్షన్స్ సెంటర్‌ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం ప్రారంభించారు. ఈమేరకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలను, ముఖ్యంగా రైతులను ఆదుకోవడంలో ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, వజ్రపుకొత్తూరు



ప్రత్యక్షదైవం శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని డిప్యూటీ సీఈవో ఎలక్షన్ కమిషనర్ విశ్వేశ్వరరావు గురువారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఘనంగా స్వాగతం పలికారు. తదుపరి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారికి ఆలయ సీనియర్ సహాయకులు శోభనాద్రిచార్యులు శ్రీస్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం



యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్‌గా పైడిరాజా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎం.వెంకటతిలక్ పదోన్నతి పొంది విజయవాడ రీజనల్‌హెడ్‌గా బదిలీ అయిన సందర్భంగా హైదరాబాద్ నుండి పదోన్నతి పొంది శ్రీకాకుళం రీజినల్ హెడ్‌గా పైడిరాజా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పైడిరాజాను ఉద్యోగ సంఘ నాయకులు స్వాగతం పలికారు.– సత్యంన్యూస్, శ్రీకాకుళం.




ఆమదాలవలసలో నిత్యఅన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో 443వ రోజున మండలంలోని కొర్లకోటకు చెందిన స్వర్గీయ సీపాన అమ్మయమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు దంటేశ్వరరావు, నీరజ దంపతులు 35మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. మజ్జిగ బాటిల్స్ పంపిణీ చేశారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

# పాత్రునివలస ఉన్నత పాఠశాలలో ఘనంగా సర్వేపల్లి 50 వ వర్ధంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

రూరల్ మండలం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పాత్రునివలసలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 50వ వర్ధంతి వేడుక ప్రధానోపాధ్యాయులు ఐ.డి.వి ప్రసాద్ అధ్యక్షతన జరిగినది. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికే తలమానికమని కొనియాడారు. ఆంగ్ల భాషోపాధ్యాయులు పూజారి రవి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు ఉపాధ్యాయ వృత్తిలో మంచి పేరు సంపాదించి విద్యార్థుల హృదయాలలో చిరస్థానం పొందారని అన్నారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షులు, ఫోర్టో జిల్లా చైర్మన్, ఏపీ జెఎసి అమరావతి జిల్లా వైస్ చైర్మన్ పిసిని వసంతరావు మాట్లాడుతూ అన్ని వృత్తులలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని అలాంటి వృత్తిని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సామాన్య ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి భారత దేశంలో అత్యున్నతమైన రాష్ట్రపతి పదవి అతని కార్యదీక్షతకు గుర్తించి పట్టం కట్టారన్నారు. ఆనాటి కాలంలో ఉపాధ్యాయులు వద్ద విద్యార్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో మెలిగేవారని, నేటి కాలంలో విద్యార్థుల్లో అది లోపించిందన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడేవారు సమయ పాలన పాటిస్తూ విద్యార్థులను ఉన్నత స్థితిలోకి చేర్చడమే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణకి ఇచ్చిన ఘనమైన నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వండాన రామారావు, తాండ్ర వెంకటరమణమూర్తి, బుడుమూరు అప్పలనాయుడు, దాష్టి సుధామణి, బెండి శారద, గొటివాడ సుభద్రాదేవి, గంగ్రేటి వినయ్ కుమార్, షాజా ది భాను, రాజనాల సతీష్ రాయుడు, తంగి పద్మావతి, బొంగు వెంకట రమణ, పైల సీతాలక్ష్మి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయించుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల ప్రవేశాల విషయంలో ప్రభుత్వము నిర్ణయాలను వేగంగా తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్‌కుమార్ కోరారు. డిగ్రీస్థాయిలో ఒక మేజర్, రెండు మేజర్లను ఉంచాలన్న విషయంపై ప్రభుత్వం ఒక కమిటీని వేసి, ఆ కమిటీ సమావేశము నిర్వహించి పది రోజులు కావస్తున్నా ఇంకా ఎటువంటి నిర్ణయాన్ని ప్రకటించక పోవటాన్ని ఏబీవీపీ ఖండిస్తుందన్నారు. మేజర్ల విధి విధానాలపై కమిటీ నివేదికని వెంటనే బహిరంగ పరచాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందన్నారు. అధికారులు సమన్వయలోపం వల్ల ఇన్ని రోజులుగా కమిటీ నివేదిక రాలేదని విద్యార్థి లోకం భావిస్తుందని ఆరోపించారు. విద్యాశాఖామంత్రి లోకేష్ వెంటనే ఈ విషయాన్ని పరిశీలించి తగిన నిర్ణయాన్ని తీసుకుని విద్యారంగంలో ఏర్పడిన గందరగోళాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ అడ్మిషన్లతో ముడి పెట్టకుండా, డిగ్రీకళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, జూలై మొదటివారం నాటికి మొదటి డిగ్రీ విద్యా సంవత్సరాన్ని ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.














# స్వర్గానికేగిన సేవామూర్తి

**రక్త సంబంధీకులు.. అందులోనూ కన్నపిల్లలు చిన్న వయసులోనే మరణిస్తే ఎంతటివారైనా గర్భశోకంతో కుమిలిపోతారు. దైనందిన జీవితాన్నే మర్చిపోతారు. కానీ ఆయన మాత్రం అలా చేయలేదు. కన్నకూతురు అర్థంతరంగా తమను.. ఈ లోకాన్నే వీడి వెళ్లిపోయిందన్న పుట్టెడు దుఃఖంతో కుంగిపోయినా.. దూరమైన కుమార్తెను సమాజ సేవలో చూసుకోవాలనుకున్నారు. దానికి కార్యరూపమే సీవీ నాగజ్యోతి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ. తన యావదాస్తిని, పెన్షన్ సొమ్ములో సింహ భాగాన్ని కూడా ఈ సొసైటీకి విరాళంగా ఇచ్చేసి.. ఆ ఛత్రం కింద వృద్ధాశ్రమం ఏర్పాటు చేయడంతో పాటు చేతికి ఎముక లేదన్నట్లు లక్షలాది మందికి దానధర్మాలు చేసి సేవామూర్తిగా.. మనుషుల్లో దేవుడిగా మన్ననలు అందుకున్నా మహోన్నతుడు చెరుకుపల్లి వరహా నరసింహమూర్తి (సీవీఎన్ మూర్తి). ఆయన సేవా తత్పరతను గుర్తించి నాలుగేళ్ల క్రితం 'సత్యం' పత్రిక 'మనుషుల్లో దేవుడు' అనే శీర్షికతో ఒక కథనం ప్రచురించింది. కాగా 82 ఏళ్ల ఈ మూర్తిగారు భువిలో అందిస్తున్న సేవలు దివిలో కూడా అవసరమని దేవుడు భావించి తీసుకుపోయాడో లేక తన కుమార్తె చెంతకు వెళ్లాలని ఆయనే అనుకున్నారో గానీ.. మంగళవారం రాత్రి తుది శ్వాస విడిచిన ఆయన సేవలకు అంతిమ నివాళిగా.. గతంలో 'సత్యం' ప్రచురించిన కథనం యథాతథంగా అందజేస్తున్నాం.**

**డి.వి.రమణ,** సత్యం ప్రత్యేక ప్రతినిధి

- ఓ పెద్దాయన కంటి సమస్యకు చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లారు. డాక్టర్లు పరిశీలించి శస్త్ర చికిత్స చేయాలంటూ.. అందుకు రూ.15 వేలు, రూ.60వేలు అయ్యే రెండు రకాల ప్యాకేజీలు ఉన్నాయని చెప్పారు. దానికా పెద్దాయన రూ.15 వేల చికిత్స చేయించుకుందాం. మిగతా డబ్బులు అభాగ్యులెవరికైనా ఉపయోగపడతాయి కదా.. అని తనతో పాటు వచ్చిన మిత్రుడితో అన్నారు. ..ఇది ఆయన పరోపకార బుద్ధికి నిదర్శనం.
- తన ఇంటి ఎదుట ఓ శునకరాజం పిల్లలు పెట్టింది. తుప్పల్లో.. చీమలు, పురుగుల మధ్య ఇంకా కళ్లు తెరవని ఆ చిన్ని పప్పీలను చూసి తట్టుకోలేక.. సదరు శునక కుటుంబానికి ఆశ్రయ మిచ్చి.. చివరికి తన ఇంటినే శునకాశ్రమంగా మార్చేశారు..

..ఇంతటి దానగుణ సంపన్నులు, భూతదయాళులు నేటి సమాజంలో ఎవరైనా ఉంటారా?.. ఒక్క చెరుకుపల్లి వరహా నర్సింహమూర్తి తప్ప!..

బతకులేక బడి పంతులు.. అని మన ముందు తరాలవారు చెప్పుకోనే కాలంలో అలాంటి ఓ సాధారణ ఉపాధ్యాయ కుటుంబంలో జన్మించి.. స్వయంకృషితో ఉద్యోగ జీవితంలో చీఫ్ ఇంజినీర్ స్థాయికి ఎదిగినా.. ఇప్పటికీ సాధారణ జీవితమే గడుపుతూ.. తన సంపాదన, అత్తగారి నుంచి సంక్రమించిన ఆస్తి.. అన్నింటినీ ఆపన్నులను ఆదుకోవడానికి.. అన్నార్తుల ఆకలి తీర్చడినికే వెచ్చిస్తూ.. సేవాసంపన్నుడయ్యారాయన.

ఒక్కగానొక్క కుమార్తె అనారోగ్యం, అత్తింటి వేధింపులు.. ఆ బాధలతోనే ఆమె అకాలమరణం సీవీఎన్ మూర్తి అనే ఈ సేవామూర్తికి అంతులేని విషాదం మిగిల్చినా.. వయసు మీద పడి వెనక్కి లాగుతున్నా.. ఆయన సేవాప్రస్థానం నిరంతరాయంగా సాగుతోంది. అభాగ్యులకు సేవల్లోనే తన కుమార్తెను చూసుకుంటున్నారు. వార్ధక్యం వయసుకే కానీ.. మనసుకు కాదని, మనసుంటే అది సంకల్పించుకుంటే.. ఏదీ అడ్డంకి కాదని నిరూపిస్తున్న మహామనీషి.. దైవం మానుష రూపేణా.. అన్న పదబందానికి రూపమిస్తే.. ఆ రూపమే సీవీఎన్ మూర్తిగా మనముందు నిలుస్తుందేమో.. కుడిచేత్తో ఇచ్చిన విషయం ఎడమ చేయికి సైతం తెలియకూడదన్నట్లు తాన సేవా కార్యక్రమాల గురించి ఏనాడూ ప్రచారం కోరుకోకపోయినా.. ఆయన దానశీలత, ఉదారత సమాజంలో మరికొందరికైనా స్ఫూర్తినిస్తుందన్న ఆశతో 'సత్యం' అందిస్తున్న కథనం..

### కుటుంబంలో కుదుపులు

ఉన్నత ఉద్యోగం, వేల రూపాయల జీతం, చిన్న కుటుంబం.. ఇన్ని సానుకూలతల మధ్య సుఖప్రదంగా సాగాల్సిన ఆయన కుటుంబాన్ని ఊహించని ఆటుపోట్లు కుదిపివేశాయి. మూర్తి దంపతులకు ముగ్గురు సంతానం. కానీ కుమార్తె నాగజ్యోతి మాత్రమే మిగిలింది. ఆమె సంసార జీవనం, వ్యక్తిగత అనారోగ్యమే మూర్తి కుటుంబాన్ని ఆర్థికంగా మానసికంగా కుంగదీశాయి. 1971లో జన్మించిన నాగజ్యోతికి ముద్దుగా చూసుకొని.. యుక్తవయసు రాగానే ఘనంగా వివాహం కూడా జరిపించారు. అయితే అత్తింట ఆమెకు వేధింపులు ఎక్కువయ్యాయి. చాలా సార్లు పెద్దల సమక్షంలో సంప్రదింపులు జరిగినా ఫలితం లేకపోయింది. విడాకుల వరకు వెళ్లింది. దాంతో కుమార్తెను మూర్తి దంపతులు తమ ఇంటికే తెచ్చేసుకున్నారు. నాగజ్యోతికి అనారోగ్యం రూపంలో మరో పెనుకష్టం ఎదురైంది. శరీరంలో అవసరాని కంటే చాలా ఎక్కువ రక్తం ఉత్పత్తి అయ్యేది. దీని వల్ల నరాలు చిట్లిపోయే ప్రమాదం ఉంటుంది. దీన్ని వైద్య పరిభాషలో హెమటాలజీ అంటారు. దీనికి చికిత్స కోసం విశాఖ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తీసుకెళ్లారు. ఎప్పటికప్పుడు ఆమె శరీరం నుంచి రక్తం తీయాల్సి వచ్చేది. ఎన్ని ప్రయత్నాలు చేసిన నాగజ్యోతి మూర్తి దంపతులకు దక్కలేదు. వారిని వదిలి వేరే లోకానికి వెళ్లిపోయింది.

### నాగజ్యోతి రూపమే సేవాస్వరూపమై..

ఉద్యోగ విరమణ, కుమార్తె నిష్క్రమణ దాదాపు ఒకే సమయంలో జరగడం మూర్తి దంపతులను వైరాగ్యం లోకి నెట్టేసింది. దాన్నుంచే సేవా సంకల్పం పుట్టింది. వృద్ధాప్యంలో ఏ తోడూ లేని తమకు డబ్బు, ఆస్తులతో పనేముంది. వాటిని ఆర్తులకు అందిస్తే బాగుంటుందని తలచారు. కుమార్తె నాగజ్యోతి స్మృతిచిహ్నంగా సీవీ నాగజ్యోతి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీని స్థాపించి దానధర్మాలు, సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఎవరికి ఏ అవసరమొచ్చినా.. ఏ సమయంలో ఎవరు తలుపుతట్టినా.. లేదనకుండా ధన, వస్తు రూపంలో సాయం చేస్తూనే ఉన్నారు.

### అత్తగారి ఆస్తీ ఆపన్నులకే..

కుటుంబ పోషణకు తండ్రి చేసిన అప్పులను ఉన్న కొద్దిపాటి పొలాన్ని అమ్మి తీర్చేశారు. దాంతో జీతం తప్ప మూర్తికి వేరే ఆస్తులు లేవు. అయితే మేనమామ కుమార్తె పద్మావతిని వివాహం చేసుకున్న ఆయనకు సహధర్మచారిణి తరపున కొంత ఆస్తి సంక్రమించింది. అత్తగారి నుంచి అందిన రెండంతస్తుల ఇంటిలో పై అంతస్తును అద్దెకిచ్చి.. కింది భాగంలో నివాసం ఉంటున్న మూర్తికి నెలకు రూ.1.22 లక్షల పెన్షన్ అందుతోంది. పెన్షన్‌లో ఓ పదివేలు, పై అంతస్తుకు వచ్చే అద్దె తమ కుటుంబ నిర్వహణకు ఉంచుకునే వారు. మిగిలిన పెన్షన్ ఇతరత్రా ఆదాయాలను వితరణ కార్యక్రమాలకే ధారబోశారు. భర్త సేవా కార్యక్రమాలకు పద్మావతి ఏనాడూ అభ్యంతర చెప్పకపోగా.. నిరంతరం వెన్నుదన్నుగా నిలుస్తూ నిజమైన సహధర్మచారిణి అనిపించుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో ఆమె తన ఒంటిపైనున్న నగలను సైతం అప్పటికప్పుడు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు ఇవ్వడం వారి దాతృత్వానికి నిదర్శనం.

### చేతికి ఎముక లేదు

మూర్తిగారి చేతికి ఎముకలేదని.. ఆయన దాతృత్వం గురించి తెలిసినవారు వ్యాఖ్యానిస్తుంటారు. ఆయన ఇచ్చిన విరాళాలు, చేపడుతున్న అన్న, వస్త్రదానాల చిట్టా తయారుచేస్తే చాంతాడంత అవుతుంది. తెలిసినంత వరకు వాటిలో కొన్నింటి వివరాలు..

- కలెక్టరేట్ సమీపంలో అనాథాశ్రమంలో మొదట అనురాగ నిలయం పేరుతో చిన్నపిల్లల వసతి కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే వృద్ధులకూ అక్కడే వసతి కేంద్రం ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహనరావు వంటి ప్రముఖుల సూచనతో సీవీఎన్ మూర్తి ఆ బృహత్తర కార్యక్రమానికి ముందుకొచ్చారు. తన ఇంటి పక్కనే ఉన్న సొంత స్థలాన్ని అమ్మగా వచ్చిన సుమారు రూ.70 లక్షల మొత్తాన్ని నేరుగా చెక్కురూపంలో అందజేసి అనాథ వృద్ధులకు ఆనందనిలయం పేరుతో ఆశ్రయం కల్పించడంలో సహకరించారు.
- రెడ్‌క్రాస్ ద్వారా ప్రతిరోజూ సుమారు 100 నుంచి 120 మంది అభాగ్యులకు అన్నదానం చేస్తున్నారు. కొన్నేళ్లుగా సాగుతున్న వితరణకు నెలనెలా తనకు అందే పెన్షన్ మొత్తం నుంచి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు చెక్కు రూపంలో అందించారు.
- కోవిడ్ కరాళనృత్యం చేస్తున్న సమయంలో ఈ సంఖ్య మరింత పెరిగింది. లాక్‌డౌన్ అమల్లో ఉన్న సుమారు ఆరు నెలలపాటు ప్రతిరోజూ 300 నుంచి 400 మందికి భోజనం సమకూర్చారు. లాక్‌డౌన్ కారణంగా ఉపాధి కోల్పోయి జిల్లాకు తరలివచ్చిన సుమారు 60వేల మంది వలసకూలీల ఆకలి తీర్చారు.
- ఏటా శీతాకాలంలో ఒకరోజు వందలాదిమంది యాచకులకు దుప్పటి, పంచె, చొక్కా, చీర తదితరాలతో కూడిన కిట్లను పంపిణీ చేస్తున్నారు. ఆ విధంగా ఈ ఏడాది కూడా పది రోజుల క్రితమే దత్తాత్రేయ జయంతి రోజున 180 మందికి అన్న, వస్త్రదానం చేశారు.
- కోవిడ్ మృతులను అంతిమ సంస్కారాలకు సరైన వాహనం లేని పరిస్థితుల్లో ఒక అంబులెన్స్‌ను రూ.2 లక్షలతో కోవిడ్ నిబంధనలననుసరించి మృతుల తరలింపునకు అవసరమైన ఏర్పాట్లు చేసి రెడ్‌క్రాస్‌కు అందించారు.
- కరోనా సేవలకు రెడ్‌క్రాస్ తరఫున పని చేసిన ఉద్యోగులకు నిధుల లేమితో జీతాలు ఇవ్వడం కష్టమైన పరిస్థితుల్లో లక్ష రూపాయలు ఇచ్చి ఆదుకున్నారు.
- హెచ్ఐవీ బాధితులకు, లెప్రసీ కాలనీవాసులకు, క్యాన్సర్ రోగులకు తరచూ అవసరమైన ఆర్థిక, వస్తు సాయం అందజేస్తుంటారు.
- కేరళకు చెందిన అయ్యప్ప ఆరాధకుడు చంద్రమౌళీశ్వరస్వామికి రూ.లక్ష విరాళమిచ్చారు.
- 2019లో రెడ్‌క్రాస్ ప్రతినిధి నిక్కు అప్పన్న మాస్టారి ఆధ్వర్యంలో జరిగిన ఘంటసాల ఆరాధనోత్సవాలకు ఆయన అభిమానిగా మూర్తి భూరి విరాళం ఇచ్చారు.

### నాలుగుసార్లు గవర్నర్ మెడల్స్

నాగజ్యోతి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ ద్వారా రెడ్‌క్రాస్ కార్యకలాపాలకు, ఇతర సేవా కార్యక్రమాలకు విరివిగా విరాళాలిస్తున్న మూర్తిని రెడ్‌క్రాస్ గవర్నర్ మెడల్స్ నాలుగుసార్లు వరించాయి. గత ముఖ్యమంత్రుల రోశయ్య, చంద్రబాబు, గవర్నర్ నర్సింహన్ తదితరులు శ్రీకాకుళం పర్యటనలో మూర్తిని స్వయంగా కలిసి.. ఆయన సేవలను ప్రశంసించారు.

# విద్యార్థుల్లో జ్వలించే కాంక్ష ఉండాలి

**❖వ్యక్తిత్వ వికాస నిపుణుడు జాయి బి హాన్స్ ❖పద్మావతిలో కెరీర్ కౌన్సిలింగ్ సదస్సు**



**(సత్యంన్యూస్, నరసన్నపేట)**

విద్యార్థుల్లో నిరంతరం జ్వలించే కాంక్ష, సాధించాలనే సంకల్పం ఉంటే అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం సులభతరమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు జాయి బి హాన్స్ అన్నారు. గురువారం స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో కెరీర్ కౌన్సిలింగ్‌లో భాగంగా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యా విజ్ఞానంతో పాటు సామర్థ్యం, నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే యువతకు ఉజ్వల భవిత సుసాధ్యమన్నారు. జీవితాలను విచ్ఛిన్నం చేసే డ్రగ్స్, మత్తు పదార్థాల పట్ల యువత జాగృత వహించి, మానవీయతా దృక్పథంతో తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎంతో శ్రమతో బిడ్డల ఉన్నతిని ఆకాంక్షించే తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా యువతీ యువకులు ముందడుగు వేసి ఉత్తములుగా ఎదిగి సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో మెండ మోహన దాస్, డీన్ ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.



ఎచ్చెర్ల వెంకటేశ్వర కళాశాలలో గురువారం మహిళలు, పిల్లల భద్రతపై సిఐ త్రినేత్ర, ఎస్ఐ రవి సిబ్బంది అవగాహన కల్పించారు. శక్తి యాప్ డౌన్‌లోడ్ గురించి విద్యార్థినులకు వివరించారు. స్మార్ట్ ఫోన్‌లోని ప్లే స్టోర్ నుంచి శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, మొబైల్ నెంబర్ రిజిస్టర్ చేసుకుంటే ఓటీపీ వస్తుందని, ఎప్పుడైనా ఎక్కడైనా ఆపదలో ఉంటే ఈ యాప్ ఉపయోగించినా, లేదా మొబైల్‌ను ఒక్కసారి షేక్ చేసినా దగ్గరలోని పోలీసులు అక్కడకు చేరుకొని సాయం చేస్తారని తెలిపారు.

**– సత్యంన్యూస్, ఎచ్చెర్ల**

# పేకాటకు పోలీస్ బాస్ అడ్డుకట్ట!

(మొదటిపేజీ తరువాయి)

చెక్‌పోస్టులు ఉండడంతో అది నిలిచిపోయింది. ఆతర్వాత బెండిగేటు మీదుగా టెక్కలిపట్నం, పలాస మీదుగా గొప్పిలి నుంచి గారబందకు వెళుతున్నారు. గొప్పిలి వద్ద చెక్‌పోస్టు పెట్టడం వల్ల అక్రమ రవాణాతో పాటు, శ్రీకాకుళం నుంచి వెళ్లి గారబందలో పేకాట శిబిరాలు నిర్వహించే వారిని అరికట్టవచ్చన్న ఆలోచన చేశారు. దాంతో ఈ మార్గంలో గతం నుంచి సాగుతున్న నకిలీ కరెన్సీ, గంజాయి, మద్యం, నాటుసారా విరివిగా జిల్లాకు అడ్డదారిలో రాకుండా చెక్ పెట్టే అవకాశం ఏర్పడింది.

### ఇతర రాష్ట్రాలకు వలస

గతంలో పాతపట్నం, మెళియాపుట్టి వద్ద చెక్‌పోస్టులు ఉన్నా వాటిని లెక్క చేయకుండా పేకాటరాయుళ్లు కార్లలో గారబందకు వెళ్లివస్తుండేవారు. జిల్లా నుంచి వెళ్లి ఒడిశాలో పేకాట నిర్వహించడం, పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంపై విమర్శలు వస్తుండడంతో రాష్ట్రస్థాయి పోలీసు ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. స్థానిక పోలీసుల సహకారంతో వీరు ఒడిశా మద్యంతో పాటు గంజాయిని రవాణా చేసి విశాఖ నుంచి వచ్చే జూదరులకు అందించేవారని ఆరోపణలున్నాయి. చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు ఉంటాయని పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించిన తర్వాత అక్రమాలకు కొంత వరకు అడ్డుకట్టు పడింది. అయితే పేకాట శిబిరాల నిర్వాహకులు మాత్రం ఎస్పీ మహేశ్వరరెడ్డిని చూసి భయపడుతున్నారు. ఆయన జిల్లాలో ఎస్పీగా విధులు నిర్వహించినన్నాళ్లు పేకాట శిబిరాల నిర్వహణకు అవకాశం ఇవ్వలేమని కొందరు పోలీసు అధికారులు చేతులెత్తేశారు. సంక్రాంతి సమయంలో ఒడిశాలో పేకాట శిబిరాన్ని నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తున్న కొందరిని పోలీసులు పిలిపించి బైండోవర్ చేశారు. దీంతో పేకాట శిబిరాల నిర్వాహకులు రాష్ట్ర సరిహద్దులు దాటి ఇతర ప్రాంతాలకు వెళ్లాలని యోచిస్తున్నారు. ఇప్పటికే కొందరు పేకాట నిర్వాహకులు గోవా, శ్రీలంక బాట పట్టారని తెలిసింది. గతంలో నేపాల్ వెళ్లి పేకాడిన సందర్భాలు ఉన్నాయి. దేశ సరిహద్దుల్లో ఉన్న నేపాల్‌లో ప్రస్తుత పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో అక్కడికి వెళ్లడానికి సాహసించడం లేదు. దీంతో గోవా, శ్రీలంక సేఫ్ ప్లేస్‌లుగా పేకాటరాయుళ్లు ఎంచుకున్నారు. మరి కొందరు ఐపీఎల్ బెట్టింగ్‌లో బిజీగా ఉన్నారని తెలిసింది.

# ఖరీఫ్‌కు నీరందించాలి

**తోటపల్లి, నారాయణపురం అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే**



**(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)**

రాబోయ్ ఖరీఫ్ సీజన్‌కు నీరందించాలని, అందుకు అవసరమైన చర్యల కోసం కలెక్టర్‌కు, గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తోటపల్లి, నారాయణపురం కాలువ అధికారులతో సమీక్షించారు. శనివారం నారాయణపురం కాలువకు సంబంధించి రైతులు, అధికారులతో కలిసి ఫీల్డ్ విజిట్ చేయనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

# భద్రతపై ఈవీఎం నోడల్ అధికారి సంతృప్తి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లపై మాసాంతపు తనిఖీల్లో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదామును రాష్ట్ర ఈవీఎం నోడల్ అధికారి కె. విశ్వేశ్వరరావు పరిశీలించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు ఈ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాములో అమలులో ఉన్న ట్రిపుల్ లాక్ విధానం, 24 గంటల సీసీటీవీ పర్యవేక్షణ, భద్రతా వ్యవస్థలను, సిబ్బంది విధులు, హాజరును ఆయన సమీక్షించారు. ఈవీఎంల భద్రత, రికార్డు నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, ఎన్నికల విభాగపు అధికారులు, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సిబ్బంది పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.